సాక్షి
ఖమ్మం
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



దరఖాస్తులు పరిష్కరించాలి

ప్రజావాణికి అందే దరఖాస్తులు, వినతులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. 8లో



ఎన్నెస్పీ కాల్వలో ట్రాక్టర్ బోల్తా

కొణిజర్ల మండలంలోని ఎన్నెస్పీ ప్రధాన కాల్వలో ట్రాక్టర్ బోల్తా పడడంతో యజమాని సహా ఇద్దరు మృతి చెందారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో సాయంత్రం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. ఆతర్వాత వాతావరణం చల్లబడి కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం

వంద మందిలో 70మంది విద్యార్థినులే!



విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండో బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు నేతృత్వాన మొదలుపెట్టిన ఫౌండేషన్ కోర్సు వారం పాటు కొనసాగుతుంది. ఆతర్వాత వచ్చేనెల 1నుంచి పాఠాలు బోధిస్తారు. తొలిరోజు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ మొదలుకాగా మొదటి బ్యాచ్‌లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్‌కు స్థానం లేదని, మంచి భోజనం అందిస్తూ, రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. కాగా, రెండు విడతల కౌన్సెలింగ్‌లో కలిపి వంద సీట్లు భర్తీ అయితే ఇందులో 70 మంది విద్యార్థినులే ఉండడం విశేషం. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు, హెచ్ఓడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు



చెక్కు అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న ఎనిమిది మందికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఖమ్మం బుర్హాన్‌పురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేయగా లబ్ధిదారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తోట రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం వీడీవోస్ కాలనీలో భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, తాండ్ర మంజుల సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నప్రసాద పంపిణీలో ఎంపీ పాల్గొన్నారు. అన్నదాన పీఠ స్ఫూర్తిదాత పగడాల కిశోర్ తదితరులు హాజరయ్యారు. కాగా, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన రిటైర్డ్ కుక్ రాపర్తి ప్రసాద్‌రావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎంపీ రవిచంద్ర పరామర్శించారు.

30లోగా ఏటీసీలో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేయగా ప్రవేశానికి ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. ఏటీసీలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు https:// iti. telangana. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 91008 52344, 70957 39332 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూలో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫీమేల్(ఎంపీహెచ్‌డబ్ల్యూ) ట్రైనింగ్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు తెలిపారు. ఇంటర్, తత్సమాన కోర్సులు పూర్తిచేసిన వారు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ప్రతులను ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా స్కూల్‌లో అందజేయాలని సూచించారు. అలాగే, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరిట తీసిన రూ.200 డీడీ జత చేయాలని, వివరాలకు స్కూల్‌లో సంప్రదించాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల విచారణ పూర్తిచేయాలి

ఖమ్మం సహకారనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కోసం అందిన దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దరఖాస్తుల విచారణ చేపట్టి అర్హులకు ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. జిల్లా నుంచి డీఆర్వో రాజేశ్వరి మాట్లాడుతూ ప్రత్యేక స్వీప్ కార్యక్రమాల అమలు, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. డీఈఓ సోమశేఖరశర్మ, డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల - పల్లిపాడు మధ్య ప్రధాన రహదారిపై గుంత

అడుగడుగునా గుంత..

సాక్షి ఫోకస్

జిల్లావ్యాప్తంగా అధ్వానంగా మారిన రోడ్లు

- ఖమ్మం – కొత్తగూడెం రహదారి మరీ దారుణం
- మిగతా చోట్ల కూడా అవే పరిస్థితులు...
- నిత్యకృత్యమైన రోడ్డు ప్రమాదాలు
- నిధులు లేక ప్యాచ్ వర్క్‌లతోనే సరి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలు తేలిన రోడ్లకు తోడు ట్రాఫిక్ సమస్యతో ప్రయాణం అంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇక చాలాచోట్ల రహదారులు ఛిద్రం కావడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే, అప్పుడప్పుడు ప్యాచ్ వర్క్‌లతోనే సరిపెడుతున్న అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించకపోవడంతో సమస్య తీవ్రత పెరుగుతోంది. ఇటీవల భారీ వర్షాలు, వరదలతో జిల్లా వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. ఇక ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లే మార్గంలో కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు వద్ద ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలన్న డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. అలాగే ఖమ్మం నుంచి చింతకాని, కొణిజర్ల, పల్లిపాడు మీదుగా ఏన్కూరు, వైరా నుంచి జగ్గయ్యపేట, మధిర నుంచి వైరా, తిరువూరు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి.

ప్రతిపాదనలతోనే సరి

జిల్లావ్యాప్తంగా 320 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నట్లు రహదారులు, భవనాల శాఖ అధికారులు గుర్తించారు. వీటి మరమ్మతులకు రూ.119 కోట్లు అవసరం అవుతాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో 76 కి.మీ. మేరకు రోడ్లు దెబ్బతినగా, కొన్ని పూర్తిగా తెగిపోయాయి. ఫలితంగా రూ.180.37 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తంగా రూ.299.37 కోట్లు మంజూరు చేస్తే అవసరమైన చోట ప్యాచ్ వర్క్ చేయడంతో పాటు ఇంకొన్నిచోట్ల కొత్త రోడ్లు నిర్మించొచ్చని అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. కానీ నిధులు మాత్రం మంజూరు కాలేదు. దీంతో ఇంకెన్నాళ్లు ఈ రోడ్లపై ప్రయాణించాలని వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- కొణిజర్ల నుండి పల్లిపాడు వరకు నాలుగు కి.మీ. మేర రహదారిపై అడుగుకో గుంత ఏర్పడింది. వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో గుంతల కారణంగా రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈనెల 15న తనికెళ్లకు చెందిన చల్లా శివ బైక్‌పై వెళ్తూ గుంతను తప్పించే క్రమాన జారి పడగా తీవ్రగాయాలతో మృతి చెందాడు.

- వైరా–జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వైరా క్రాస్ రోడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న గుంతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సామగ్రి చేరవేసే లారీలు తిరుగుతున్నాయి. ఫలితంగా రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. దీంతోపాటు వైరా–సత్తుపల్లి జాతీయ రహదారి, వైరా –మధిర ప్రధాన రహదారిపై గొల్లపూడి, తాటిపూడి, పాలడుగు గ్రామాల వద్ద గుంతలు ఏర్పడ్డాయి.



మట్టి తేలి, గుంతలమయమైన వైరా - జగ్గయ్యపేట రోడ్డు



చింతకాని మండలం కొదుమూరు వద్ద రోడ్డుపై గుంత

- చింతకాని నుంచి వెంకటాయపాలెం వరకు ఉన్న రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగా ఖమ్మంకు రాకపోకలు సాగిస్తారు. సుమారు పదేళ్ల క్రితం నిర్మిచిన బీటీ రహదారి దెబ్బతినడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే అసౌకర్యానికి గురవుతున్నారు.



ఏన్కూరు మండలం భగవాన్‌నాయక్ తండా - అక్కినాపురం తండా రోడ్డు ఇలా..

- ఏన్కూరు నుండి భగవాన్ నాయక్ తండా, అక్కినాపురం తండా వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రయాణికులు ఈ రహదారిపై వెళ్లిరావడానికి నానా పాట్లు పడుతున్నారు. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



తల్లాడ - కొత్తగూడెం రహదారిపై ఏర్పడిన గుంతలు

- తల్లాడ–కొత్తగూడెం మార్గంలో రహదారి పలుచోట్ల దెబ్బతిన్నది. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలు ఏర్పడ్డాయి. తల్లాడ–దేవరపల్లి జాతీయ రహదారిపైనా గుంతలు తేలాయి. తల్లాడ రింగ్ రోడ్‌లో గుంతలు ఏర్పడగా రాత్రివేళ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



అధ్వానంగా ఉన్న మధిర - వైరా ప్రధాన రహదారి

- మధిర నుంచి వైరా, తిరువూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలతో ధ్వంసమైంది. లోతైన గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు గుంతల్లో మట్టి పోసినా రోజూ కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయి మళ్లీ గుంతలు తేలాయి.

నష్టం వచ్చినా పంటల కొనుగోలు



పత్తి కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- ప్రైవేట్ వ్యాపారులు కూడా పత్తికి మద్దతు ధర చెల్లించాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్: ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులు మాత్రం ఇబ్బంది పడకుండా పంట ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని రాష్ట్ర వ్యయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులో సీసీఐ ద్వారా ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, ఇక్కడ మద్దతు ధరతో పత్తి అమ్ముకోవాలని సూచించారు. కాగా, రైతుల పేరుతో దళారులు, వ్యాపారులు సీసీఐ కేంద్రాలకు రాకుండా పోలీస్, రెవెన్యూ, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత వర్షాలతో పత్తి దిగుబడి తగ్గినందున, రైతులు 12శాతం లోపు తేమ ఉండేలా ఒకరోజు ఆలస్యమైనా వేచిఉండాలని తెలిపారు. అలాగే, పత్తిని ప్రైవేట్‌గా కొనుగోలు చేసే వ్యాపారులు సైతం మద్దతు ధర చెల్లించాలని మంత్రి సూచించారు. పత్తి, మిర్చి సాగుకు వాతావరణం అనుకూలించడం లేనందున రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలని తెలి పారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు, నాయకులు మద్ది మల్లారెడ్డి, కన్నేటి నర్సింహారావు, తేజావత్ పంతులునాయక్, కన్నేటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఎక్కడ?

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించే సమయాన రైతులెవరూ కనిపించలేదు. దీంతో రైతులను తరలించాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించారని మార్కెటింగ్ శాఖ అధికారులపై మంత్రి తుమ్మల అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడ అంతా వ్యాపారులే ఉన్నారని, రైతులు ఎక్కడ అని ఆయన ప్రశ్నించడంతో అధికారులు నీళ్లు నమిలారు.

'రైతునేస్తం' ఫౌండేషన్ సందర్శన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఏపీలోని గుంటూరు జిల్లా కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యాన సాగు చేస్తున్న వివిధ పంటలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచండి

- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- ఖమ్మం రైల్వేస్టేషన్‌లో పరిశీలన, సూచనలు



రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా పనులు పూర్తిచేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడుతానని.. ఇకనైనా వేగం పెంచి పూర్తిచేయాలని తెలిపారు. విశ్రాంతి గది, క్యాంటీన్ నిర్మాణాలు, ప్లాట్‌ఫాంలపై షెల్ల నిర్మాణం, ఎస్కలేటర్ పనులపై ఆరా తీసిన ఎంపీ, డ్రెయినేజీ నీరు ట్రాక్ పక్క నుంచి వెళ్లకుండా దారి మళ్లించడానికి ఉన్న అవకాశాలపై సమీక్షించారు. అలాగే, మూడో లైన్ పనులను కూడా పరిశీలించారు. కాగా, స్టేషన్‌లోని పార్కింగ్ స్టాండ్‌ను ఎంపీ తనిఖీ చేసిన సమయాన ఎక్కువ ధర తీసుకుంటున్నారని పలువురు చెప్పగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. రైల్వే ఏడీఎన్ రమేష్, స్టేషన్ మాస్టర్ ప్రసాద్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.జాఫర్, అధికారులు రాంనివాస్, శ్రీనివాస్, మోహన్‌కుమార్, శ్రీనివాసరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ఎం.డీ.ముస్తఫా, మిక్కిలినేని నరేందర్, అనంతరెడ్డి, ఉమ్మినేని కృష్ణ, పాపానాయక్ పాల్గొన్నారు.

హైవేల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా మీదుగా సాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. అధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించిన ఆయన నాగర్‌కర్నూల్ – అమరావతి, సూర్యాపేట– జంగారెడ్డిగూడెం జాతీయ రహదారులు, ఖమ్మం–కురవి హైవేలను కలుపుతూ ఖమ్మంలో నిర్మించే రింగ్‌రోడ్ పనులు, సర్వీస్ పాయింట్లపై ఆరా తీశారు.

నేడు ఎంపీ పర్యటన

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30 గంటలకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేయనున్నారు. ఆతర్వాత 3 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే దిశా కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

వ్యవసాయం, రైతుల సంక్షేమ కమిషన్‌లో స్థానం

సభ్యుడిగా రాంరెడ్డి గోపాల్‌రెడ్డి నియామకం



రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాంరెడ్డి గోపాల్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి దక్కింది. రాష్ట్రప్రభుత్వం తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటుచేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిషన్‌కు మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌ను చైర్మన్‌గా నియమించగా సభ్యుడిగా గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబంపై నమ్మకంతో కమిషన్ సభ్యుడిగా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, సహకరించిన డిప్యూటీ సీఎం, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ రఘురాంరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీని వీడకుండా...

వ్యవసాయ కుటుంబంలో జన్మించిన గోపాల్‌రెడ్డి సైతం వ్యవసాయాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. అంతేకాక కామేపల్లి మండలంతో పాటుగా ఇల్లెందు నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీని కంచుకోటగా నిలిపారు. ఒడిదొడుకులు ఎదురైనా ఆయన కుటుంబం కాంగ్రెస్ పార్టీని వీడలేదు. కాగా, 1972లో హనుమకొండ వరంగల్ ఆర్ట్స్ కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్‌గా, 2013–19 వరకు కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన గోపాల్‌రెడ్డి 2022 నుంచి టీపీసీసీ జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో పదవి దక్కడంతో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు, మరికొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. అయితే, ఉదయం నుంచి సాయంత్రం వరకు గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఆతర్వాత వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. జిల్లాలోని కొణిజర్లలో 53, పెనుబల్లిలో 38, ఖమ్మం ఖానాపురంలో 28, పెనుబల్లి మండలం గౌరారంలో 19.8, రఘునాథపాలెం మండలంలో 19 మి.మీల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. అలాగే, వైరాలో 15, ముదిగొండలో 10.5, ఎర్రుపాలెంలో 8.5, కామేపల్లి మండలం లింగాలలో 5.8, బోనకల్ మండలం రావినూతలలో 5.5, ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 4.8, సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలో 4.5, ముదిగొండ మండలం పమ్మి, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 2.5 మి.మీ.ల వర్షం నమోదైంది.

పోలీసు త్యాగాలతోనే దేశ ప్రగతి

- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- స్మారకస్థూపం వద్ద నివాళులర్పించిన సీపీ, అధికారులు



నివాళులర్పిస్తున్న పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు



అమరవీరులకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంక్రైం: శాంతి స్థాపనకోసం అమరులైన పోలీసుల త్యాగాల ఫలితంగానే దేశ ప్రగతికి బాటలు పడుతున్నాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మం పరేడ్ మైదానంలో పరేడ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. పోలీస్ అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. జిల్లాలో అధికార యంత్రాంగం ప్రశాంతంగా విధులు నిర్వర్తించడానికి ఆనాటి పోలీసుల త్యాగాలే కారణమని చెప్పారు. ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసులను యువ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ప్రజా రక్షణ కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని, కుటుంబాలు, వ్యక్తిగత జీవితాలను తాగం చేసి ఉద్యోగ నిర్వహణకు అంకితమవుతున్నారని చెప్పారు. తొలుత ఆర్ఐ శ్రీశైలం ఇన్‌చార్జ్‌గా పరేడ్ నిర్వహించగా స్థూపం వద్ద కలెక్టర్, సీపీ, అధికారులు, అమరవీరుల కుటుంబసభ్యులు నివాళులర్పించారు. కాగా, పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 25, 27న సైకిల్ ర్యాలీ, 26వ తేదీన రక్తదాన శిబిరం, 27నపోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు, 28వ తేదీన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు, 29వ తేదీన ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, విజయబాబు, ఏసీపీలు వెంకటేష్, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, సాంబరాజు, రవి, మల్లయ్య, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు, సీఐలు ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, రమేష్, భానుప్రకాష్, రాజు, మురళి, రాజిరెడ్డి, మోహన్‌బాబు, హనూక్, స్వామి, పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఏసోబు, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

స్పృహ కోల్పోయిన సీఐ

పరేడ్ మైదానంలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించే సమయాన ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ ఒక్కసారిగా కళ్లుతిరిగి స్పృహ కోల్పోయారు. దీంతో ఆయనను సహచర ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన ఎండలో ఉండటంతో కళ్లు తిరిగి పడిపోయి ఉంటారని వైద్యులు తెలిపారు.

దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి


ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- గ్రీవెన్స్ డేలో దరఖాస్తులు, వినతుల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత అంశాలతోపాటు సదరం సర్టిఫికెట్లు, పెన్షన్ల కోసం దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. డీఆర్వో శిరీష, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతో హాజరుకండి

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై మంగళవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం జరగనుండగా అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. దిశ కమిటీ సమావేశం సన్నద్ధతపై అధికారులతో సమీక్షించిన ఆయన గత ఐదేళ్లలో కేంద్రప్రభుత్వం నుండి వచ్చిన నిధులు, వ్యయంపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీవో సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణకు క్షేత్ర స్థాయి అనుభవం

క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వర్తించడం సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారులు క్షేత్రస్థాయి శిక్షణ కోసం జిల్లాకు రాగా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా చారిత్రకంగా ప్రాముఖ్యత కలిగి ఉన్నందున క్షేత్రస్థాయిలో అధ్యయనం అధికారులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈసమావేశంలో ఎంసీహెచ్ఆర్‌డీ ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మెరుగైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సభ్యులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూనే ప్రవేశాలు పెంచి నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ద్వారా రెండు పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాడిశెట్టి కృష్ణ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఆదేశాలతో కంప్యూటర్ విద్య బోధనకు సిద్ధమయ్యామని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు పాడిశెట్టి మాధవి, మరియేస్ పాలి, కంచం వంశీ పాల్గొన్నారు.

త్వరలో ఆటోడ్రైవర్లకు హెల్త్‌క్యాంపు

ఆటో డ్రైవర్లు మెరుగైన జీవనం సాగించేలా ప్రభుత్వం తరఫున అవసరమైన తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆటో యూనియన్ల నాయకులతో సమావేశమై బీమా, అడ్డాల వద్ద సౌకర్యాలు తదితర సమస్యలు ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే వైద్యశిబిరాలు నిర్వహించి ఆటోడ్రైవర్లకు అవసరమైన వైద్యపరీక్షలు చేయిస్తామని తెలిపారు. అవకాశమున్న అడ్డాల వద్ద కేఎంసీ ద్వారా టాయిలెట్ల నిర్మాణం చేపడతామని, వాటి నిర్వహణ బాధ్యత యూనియన్లు స్వీకరించాలని సూచించారు. అలాగే, ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డుల జారీ, రూ.5లక్షల బీమా, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. డీటీఓ వెంకటరమణ, యూనియన్ల నాయకులు ఎస్.నరేష్ మోహన్, ఉపేందర్, శ్రీను, మోహన్‌రావు, పాల్వంచ కృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కలెక్టర్ కోసం ఎదురుచూసి...

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తొలుత ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆతర్వాత అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లడంతో డీఆర్వో శిరీష, జెడ్పీ సీఈఓ దీక్షారైనా ఫిర్యాదులు స్వీకరించడం మొదలుపెట్టారు. కానీ చాలామంది కలెక్టర్‌కు ఇస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయనే భావనతో గంటన్నర వరకు ఎదురుచూసి ఆయన వచ్చాకే వినతులు ఇవ్వడం గమనార్హం.

మహిళల శ్రమను దోచుకుంటున్నారు..



కొత్తగూడెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఐద్వా నాయకురాళ్లు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న బృందాకారత్

- పెట్టుబడిదారీ విధానంపై పోరాడాలి
- సింగరేణిలో 49శాతం వాటా ప్రైవేట్ పరానికి కేంద్రం కుట్ర
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్

సింగరేణి(కొత్తగూడెం): మహిళల శ్రమను దోపిడీ చేస్తున్న మనువాదం, పెట్టుబడిదారీ విధానంపై ఉద్యమించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు, ఐద్వా సీనియర్ నాయకురాలు బృందాకారత్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం త్రిశూల్ విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. వాటిలో ఒకటి పెట్టుబడిదారీ కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు, రెండోది మతోన్మాద భావజాలం, మూడోది మహిళలను తిరోగమన భావజాలం వైపు నడిపించే మనువాద సిద్ధాంతమని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో 49 శాతం వాటాను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, తద్వారా వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి ఉపరితల గనుల కోసం గిరిజనులు, దళితుల నుంచి పెద్ద ఎత్తున భూసేకరణ చేస్తున్నారని, దీనికి సరైన పరిహారం అందించడం లేదని విమర్శించారు. మణుగూరు ప్రాంతంలో గిరిజనుల నుంచి మూడుసార్లు సింగరేణి సంస్థ భూములు లాక్కుని రైతులను నిర్వాసితులుగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు ఈ దేశ పౌరులు కాదా అని ఆమె ప్రశ్నించారు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారిలో 95 శాతం మంది మహిళలేనని, వారికి రోజుకు రూ.250 చెల్లించి క్వింటాళ్ల కొద్ది మట్టి మోయిస్తున్నారని అన్నారు. ఆన్‌లైన్ మస్టర్ పేరుతో వేలి ముద్రలు పడక వేతనాలు రావడం లేదన్నారు. గతంలో ఉల్లిగడ్డలు కోస్తే కన్నీళ్లు వచ్చేవని, బీజేపీ హయాంలో కొనాలంటేనే నీళ్లు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ధరల పెరుగుదల, ఆహార భద్రత ప్రధాన సమస్యగా మారాయని, దీనిపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మహిళలు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్నారని, గత ప్రభుత్వం వారిని మోసం చేసిందని విమర్శించారు. స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయడం లేదని, ఇళ్లు లేనివారికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈసభలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జాతీయ అధ్యక్షురాలు పీ.కే.శ్రీమతి, కోశాధికారి ఎస్. పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధా సుందర రామన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, బుగ్గవీటి సరళ, డి.సీతాలక్ష్మి, ఎం. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సౌత్ జోన్ మీట్‌లో అథ్లెట్ల ప్రతిభ


పతకాలు సాధించిన అథ్లెట్లతో డీవైఎస్ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఏపీలోని గుంటూరులో జరిగిన దక్షిణ భారత స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఏడు పతకాలు సాధించారు. ఇందులో ఎస్.గోపిచంద్, కె.మస్తాన్, బి.వైశాలి వివిధ విభాగాల్లో రెండేసి కాంస్య పతకాలతో పాటు ఎస్.కే.అఫ్రిన్ కాంస్య పతకం దక్కించుకుంది. వీరిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ నున్నా రాధాకృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు ఎం.సుధాకర్, డి.రవికుమార్ తదితరులు అభినందించారు.

రేపు వాహనాల వేలం పాట

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–2 పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈనెల 23వ తేదీన వేలం వేయనున్నట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1లో ఉదయం 11గంటలకు వేలం మొదలవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు



ర్యాలీలో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: యాభై ఏళ్లుగా విద్యారంగం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు చేస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.క్రాంతి, మస్తాన్ తెలిపారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 వసంతాలు నిండిన సందర్భంగా సోమవారం ఖమ్మం పెవిలియన్ మైదానం నుంచి రిక్కాబజార్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో క్రాంతి, మస్తాన్ మాట్లాడుతూ అనేక ఉద్యమాలు నిర్వహించగా, పలువురు ప్రాణాలర్పించారని తెలిపారు. కాగా, ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 24న జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరు మధుతో పాటు నాయకులు రాజేష్, ప్రణయ్, ఎం. రాజేంద్రప్రసాద్, సారంగపాణి, కోల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగి

ఖమ్మం సహకారనగర్: టీజీ ఎప్‌సెట్ ద్వారా ఫార్మా డీ, బీ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను సోమవారం నుంచి పరిశీలిస్తున్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటుచేయగా తొలిరోజు 448మంది స్లాట్ బుక్ చేసుకోగా 415మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈ పరిశీలన మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విద్యార్థుల వివరాలను సిబ్బంది అక్కడిక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

రెండు రోజుల్లో క్యాంటీన్ ప్రారంభం?

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ రెండో అంతస్తులో మహిళా శక్తి క్యాంటీన్‌ను రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలిసింది. కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం క్యాంటీన్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యాన ప్రారంభించాల ని నిర్ణయించగా, సోమవారం డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	4,960
మిర్చి	16,500	9,000
మిర్చి తాలు	9,400	8,000
ఏసీ మిర్చి	19,000	10,200
ఏసీ తాలు	9,200	9,000
కొత్త పత్తి	7,000	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

కోటమైసమ్మ జాతర ఆదాయం రూ.27.17లక్షలు


కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయపల్లిలో దసరా సందర్భంగా నిర్వహించిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతరలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కతేలింది. ఈనెల 12నుంచి 16వ తేదీ వరకు రూ.7.03లక్షలు ఆదాయం నమోదు కాగా, 20వ తేదీ వరకు వచ్చిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈమేరకు నాలుగు రోజుల్లో రూ.30,543 ఆదాయం రాగా హుండీ ఆదాయం రూ.7,33,549గా నమోదైందని, ఇది గత ఏడాదితో పోలిస్తే రూ.31,930 అధికమని ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు తెలిపారు. ఇక హుండీ ఆదాయంతో పాటు కొబ్బరికాయలు, పూజాసామగ్రి, ప్రసాదాల అమ్మకం, దుకాణాల ఏర్పాటుకు వేలం ద్వారా గత ఏడాది రూ.26,26,737 వస్తే ఈసారి రూ.27,17,949గా నమోదైందని వెల్లడించారు. తద్వారా గత ఏదాదితో పోలిస్తే ఆదాయం రూ.91,212 పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కై లాశ్‌శర్మ, ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ కాల్వలో ట్రాక్టర్ బోల్తా

- ట్రాక్టర్ యజమాని సహా మరొకరు మృతి
- అదుపు తప్పడంతో ప్రమాదం


సైదులు (ఫైల్)


భీమ్‌దేవ్ (ఫైల్)


కాల్వలో నుంచి జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తీయిస్తున్న దృశ్యం

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని ఎన్నెస్పీ ప్రధాన కాల్వలో ట్రాక్టర్ బోల్తా పడగా ఇద్దరు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ గుగులోత్ సూరజ్, స్థానికులు తెలిపిన వివరాలు.... వైరా శాంతినగర్ పాత తండాకు చెందిన భూక్యా సైదులు(50), శాంతినగర్ తండాకు చెందిన బానోత్ భీమ్‌దేవ్(45) ట్రాక్టర్‌పై రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో ఇనుప చువ్వలు వేసి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో కొణిజర్ల మండలం బోడియా తండా సమీపాన ఎన్నెస్పీ ప్రధాన కాల్వ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజన్‌పై ట్రక్కు పడడంతో ట్రాక్టర్ నడుపుతున్న సైదులు, పక్కన కూర్చున్న భీమ్‌దేవ్ ఇద్దరూ తీవ్రంగా గాయపడడమే కాక నీటిలో మునిగి మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో బోడియాతండా వాసులు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ జి.సూరజ్ సిబ్బందితో చేరుకుని జేసీబీ సాయంతో ట్రాక్టర్‌తో పాటు మృతదేహాలను బయటకు తీయించారు.

ఇటీవలే ట్రాక్టర్ కొనుగోలు

శాంతినగర్ పాత తండాకు చెందిన భూక్యా సైదులు ఇటీవలే ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. భవన నిర్మాణ సామగ్రిని అద్దె ప్రాతిపదికన చేరవేస్తూ జీవనం సాగిస్తుండగా ట్రాక్టర్ కాల్వలో పడడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య అచ్చమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మరో మృతుడు భీమ్‌దేవ్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలాన్ని వైరా సీఐ సాగర్‌నాయక్ పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

పాలేరు పాత కాల్వను పరిశీలించిన సీఈ


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీఈ విద్యాసాగర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ పాత కాల్వ మరమ్మతు పనులను సోమవారం జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్ పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలతో కాల్వకట్టలు తెగిపోగా పునర్నిర్మిస్తున్నారు. ఈమేరకు పనులను పరిశీలించిన ఆయన నాణ్యతపై సిబ్బందికి సూచనలు చేయడంతో పాటు త్వరగా పూర్తిచేసి నీరు సరఫరా చేయాలని తెలిపారు. ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రేమపూర్వక బోధనతో మంచి ఫలితాలు


పాఠశాలలో మొక్క నాటుతున్న మైఖేల్

వైరా: విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధించాలని డాన్‌బాస్కో సంస్థ సౌత్ ఏసియా రీజినల్ కౌన్సిలర్ ఫాదర్ బిజు మైఖేల్ సూచించారు. వైరా మండలం పినపాకలోని డాన్‌బాస్కో పాఠశాలలో సోమవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటిన అనంతరం బిజు మైఖేల్ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. మార్పులను అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు ప్రేమపూర్వకంగా బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డితో పాటు రాజేష్, జోసఫ్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా నాసరయ్య


పసుపులేటి నాసరయ్య

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పసుపులేటి నాసరయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామ శ్రీనివాస్, స్టీరింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. 2001 నుంచి తాను ఉద్యమంలో కొనసాగుతుండగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లా మొదటి అధ్యక్షుడిగా నియమించారని, ఆ తర్వాత 2005లో రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పనిచేసినట్లు చెప్పారు. ఈమేరకు ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని తెలిపారు.

రూ.56 లక్షలకు మహిళ దివాలా పిటీషన్

ఖమ్మం లీగల్: కూసుమంచి మండలం కోక్యాతండా గ్రామానికి చెందిన పిల్లి శ్రీలక్ష్మి రూ.56 లక్షలకు దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేసింది. ఆమె గత ఏడేళ్లుగా వస్త్ర వ్యాపారం నిర్వహిస్తూ పలువురి వద్ద అప్పులు చేసింది. ఈక్రమాన తనకు నష్టం వచ్చి అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందని చెబుతూ ఏడుగురిని ప్రతివాదులుగా పేర్కొంటూ న్యాయవాది ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం పిటీషన్ దాఖలు చేసింది.

ప్లాట్‌ఫాం పైనుంచి ట్రాక్‌పై పడిన మహిళ

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఓ మహిళ ప్లాట్‌ఫాం పైనుంచి ఆకస్మాత్తుగా ట్రాక్‌పై పడింది. జనగామ జిల్లాకు చెందిన నాగమణి రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉండగా ఒక్కసారిగా ట్రాక్‌పై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో అప్రమత్తమైన సహచర ప్రయాణికులు ఆమెను పైకి తీసుకొచ్చారు. అదేసమయాన స్టేషన్‌లో తనిఖీకి వచ్చిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి నాగమణిని పరామర్శించి ఆస్పత్రికి పంపించారు.

హైదరాబాద్‌లో ఖమ్మం యువకుడు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఖమ్మం పాకబండబజార్‌కు చెందిన మేదేల పిచ్చయ్య కుమారుడు పవన్‌కల్యాణ్(25) కొంతకాలంగా మద్యానికి బానిస కావటంతో హైదరాబాద్ దమ్మాయిగూడెంలోని ఓ ఫౌండేషన్‌కు సంబంధించి రీహ్యాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించారు. అయితే, దసరా పండుగకు కూడా వచ్చిన పవన్‌లో మార్పు రావడంతో కుటుంబీకులు సంతోషించారు. తిరిగి ఆయన ఇటీవల హైదరాబాద్ వెళ్లగా సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఫౌండేషన్ బాధ్యులు సమాచారం ఇచ్చారు. దీంతో పిచ్చయ్య తదితరులు హైదరాబాద్ వెళ్లేసరికి పవన్‌కల్యాణ్ శరీరంపై గాయాలు ఉండడం, ఆయనకు డైపర్ సైతం తొడిగించి ఉండడంతో ఫౌండేషన్ బాధ్యులే కొట్టి చంపి ఉంటారనే అనుమానంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

కుమారుడి పుట్టు వెంట్రుకలు తీసేందుకు అన్నవరం వెళ్లొచ్చేసరికి ఘటన

ఖమ్మంక్రైం: పోలీస్ కానిస్టేబుల్ కుటుంబం తమ చిన్నారి పుట్టువెంట్రుకలు తీసేందుకు ఏపీలోని అన్నవరం వెళ్లొచ్చేసరికి ఇంట్లోకి చొరబడిన దొంగలు బంగారం, నగదు అపహరించారు. ఈ ఘటన వివరాలు... భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హిమతేజ్ కుటుంబం ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఆర్‌డబ్ల్యూస్ కార్యాలయం ఎదురుగా నివసిస్తోంది. ఆయన ఇంట్లో చిన్నారి పుట్టువెంట్రుకలు తీసేందుకు అన్నవరం వెళ్తుండగా సోదరి జయసుధ, బంధువులు ఖమ్మం రావడంతో, సోదరి బంగారు ఆభరణాలు ఇక్కడే పెట్టి శనివారం రాత్రి వెళ్లారు. తిరిగి ఆదివారం అర్ధరాత్రి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపల పరిశీలించడంతో బీరువా తెరిచి ఉండడం, అందులోని 16తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు లేకపోవడంతో ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ బాలకృష్ణ, సీసీఎస్ సీఐ రాజు, క్లూస్‌టీమ్ సిబ్బంది చేరుకుని ఆధారాలు సేకరించడమేకాక సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాగా, చోరీ అయిన సొత్తు విలువ రూ.10లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు.

వినాయక విగ్రహం ఆభరణాలు..

పురాతన శివలింగాన్ని కదిలించిన దొంగలు

నేలకొండపల్లి: పురాతాన కాలం నాటి వినాయక విగ్రహానికి చెందిన వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లిలోని శ్రీభక్తరామదాసు ధ్యాన మందిరం ముందు 1,200 ఏళ్ల నాటిదిగా భావిస్తున్న వినాయక విగ్రహం ఉండగా, సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహానికి ఉన్న వెండి కన్నులు, కనుబొమ్మలను చోరీ చేశారు. అలాగే, అదే స్థానంలో శివలింగాన్ని పెకిలించేందుకు తవ్వకాలు చేపట్టారు. ఇక్కడ గుప్తనిధులు ఉన్నాయనే భావనతో తవ్వకం చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.చారు.

రూ.2లక్షల విలువైన కాపర్‌వైర్..

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం ఎత్తిపోతల పథకానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రూ.2లక్షల విలువైన కాపర్‌వైరు, ఆయిల్ చోరీ జరిగింది. కొద్దిరోజుల క్రితమే చోరీ జరిగినట్లు తెలుస్తుండగా సోమవారం గుర్తించినట్లు సమాచారం. ఈమేరకు జల వనరుల శాఖ ఏఈ కల్పన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

అనుమతులు లేని నిర్మాణం తొలగింపు

నిర్మాణదారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని 34వ డివిజన్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇంటి పనులు నిలిపివేయాలని కేఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా పనులు ఆపకపోవడంతో కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం నిర్మాణ స్థలానికి వెళ్లారు. జేసీబీతో తొలగిస్తుండగా నిర్మాణదారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంటది. దీంతో అధికారులు పాక్షికంగా తొలగించి మిగిలిన నిర్మాణాన్ని స్వయంగా తొలగించాలని యజమానికి మరోమారు నోటీసు జారీచేశారు.

రిటైర్డ్ పీడీ రామస్వామి మృతి


రామస్వామి (ఫైల్)

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ పులి రామస్వామి(75) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో నివాసముండే ఆయన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో పీడీగా విధులు నిర్వర్తించారు. ఎందరినో జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన రామస్వామి మృతిపై సంతాపం ప్రకటించిన క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

లారీని ఢీకొట్టడంతో వాహనదారుడు...

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. సీఐ ముష్కాన్ రాజు తెలిపిన వివరాలు.. కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన వల్లమూడి వెంకటేశ్వర్లు(26) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తూ ఇక్కడే నివాసముంటున్నాడు. ఆయన ఆదివారం ముల్కలపల్లిలో తన స్నేహితుడి ఇంటి వద్ద జరిగిన ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

పిడుగుపాటుతో మేకలు మృతి

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గ్రామానికి చెందిన పాటిబండ్ల యశోద స్థానిక కొండారెడ్డి చెరువుకట్ట మీదుగా మేకలను మేతకు తీసుకెళ్లే క్రమాన వర్షం వస్తుండడంతో ఓ చెట్టు క్రిందకు వెళ్లింది. ఇంతలోనే సమీపంలో పిడుగు పడటంతో ఆరు మేకలు అక్కడిక్కడే మృతి చెందాయి. అలాగే, యశోద స్పృహ కోల్పోగా గమనించిన స్థానికులు వైద్యుడి వద్ద తీసుకెళ్లి చికిత్స చేయించడంతో ప్రాణాప్రాయ స్థితి నుంచి బయటపడింది.

వివాహిత అదృశ్యంపై కేసు

రఘునాథపాలెం: మండల కేంద్రానికి వివాహిత కానరాకుండా పోయిందని ఆమె భర్త రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం పోలీసులు కేసు నమోదు రిచేశారు. భర్తతో ఘర్షణ పడి ఈనెల 18న ఆమె ఇంటి నుంచి వెళ్లగా ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.